మంచిమాట

మంచిమాట దానం లాంటిది, ప్రతిఫలంగా పుణ్యాన్ని అందిస్తుంది. చెడ్డమాట అప్పులాంటిది, ప్రతిగా వడ్డీ చెల్లించాల్సి వస్తుంది.

RNI NO : TELTEL/2023/88524

# మెదక్ టుడే

MEDAK TODAY

తెలుగు దిన పత్రిక...

శనివారం, 07 ఫిబ్రవరి 2026 | మెదక్ | పేజీలు :4 | వెల రూ.:2 | ఎడిటర్: సిహెచ్. శివకుమార్ | సంపుటి 04 | సంచిక 82

## కేసీఆర్, కేటీఆర్‌లను అరెస్టు చేస్తారనే కాళేశ్వరం ప్రాజెక్టు

# విచారణను సీబీఐకి అప్పగించాం

- 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో నిజామాబాద్ మురికి కూపంగా మారింది
- కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూడా నిజామాబాద్‌కు ఏం చేయలేదు
- నిజామాబాద్ సభలో సీఎం రేవంత్ రెడ్డి



**నిజామాబాద్ :** లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని బీజేపీ చెప్పిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కేటీఆర్, కేసీఆర్‌ను అరెస్టు చేస్తారని కాళేశ్వరం కేసును సీబీఐకి అప్పగిస్తే ఇంతవరకు అతి లేదు గతి లేదని మండిపడ్డారు. కేసీఆర్, కేటీఆర్‌లను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కాపాడుతున్నారని ఆయన ఆరోపించారు. అసలు కిషన్‌రెడ్డి ఎందుకు కాపాడుతున్నారు? అని ప్రశ్నించిన సీఎం కిషన్‌రెడ్డి కల్వకుంట్ల కిషన్‌రావుగా మారారని ధ్వజమెత్తారు. ఎప్పుడో కాంగ్రెస్ నిర్మించిన ప్రాజెక్టులు ఎలా ఉన్నాయి, మీరు కట్టిన ప్రాజెక్టులు ఎలా ఉన్నాయి? అని ప్రతిపక్షంపై ప్రశ్నలు సంధించారు. నిజామాబాద్ జిల్లా బర్దిపూర్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించారు. ఫిబ్రవరి 11న జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరవేయబోతున్నామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లా తెలంగాణకు గొప్ప నాయకులను అందించిందని, మున్సిపల్ ఎన్నకల్లో విలక్షణమైన తీర్పు ఇవ్వాలని జిల్లా ప్రజానికాన్ని కోరారు. 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో నిజామాబాద్ మురికి కూపంగా మారిందన్న ఆయన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూడా ఇందూరుకు ఏం చేయలేదన్నారు. కాళేశ్వరంపై కేంద్రప్రభుత్వం చర్యలు ఏమైయ్యాని బీజేపీని అడుగుతున్నట్లు చెప్పారు. మళ్లీ అధికారంలోకి కాంగ్రెస్ : నిజామాబాద్ పసుపు బంగారంతో పోటీ పడేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. ఇక్కడి వ్యవసాయం తెలంగాణకే కాదు దేశానికే ఆదర్శం అని కొనియాడారు. నిజామాబాద్ రైతుల పోరాటం దేశానికే ఆదర్శమని ప్రశంసలు కురిపించారు. 2028 ఎన్నికల్లో కాంగ్రెస్‌ను మళ్లీ అధికారంలోకి తీసుకువస్తామని ధీమా వ్యక్తం చేశారు. నిజామాబాద్‌లోని ప్రాజెక్టుల పూర్తికి, అదనపు నిధులు ఇవ్వడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. టీపీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్ గౌడ్ సూచనలతో నిజామాబాద్‌లో అభివృద్ధి పనులు చేస్తున్నామని సీఎం తెలిపారు. నిధులు విడుదల చేసి మున్సిపాల్టీలను అభివృద్ధి చేయాలనుకున్నా, 90 శాతం మున్సిపాల్టీల్లో బీఆర్ఎస్ సభ్యులే ఉన్నారని అన్నారు. ఒకవేళ నిధులు ఇచ్చినా అభివృద్ధి చేస్తారనే నమ్మకం లేదని, కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకుంటేనే మున్సిపాల్టీల్లో వేగంగా అభివృద్ధి జరుగుతుందన్నారు. నిజామాబాద్ కు ఏం తెచ్చారు : బీజేపీలో నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు పరపతి లేదని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. నిజామాబాద్‌ను ఎందుకు స్మార్ట్ సిటీగా ప్రకటించలేదు? అని ప్రశ్నించారు. బీజేపీ నేతలు తెలంగాణకు కేంద్రం నుంచి నిధులు తీసుకురావడం లేదని ఆక్షేపించారు. నిజామాబాద్‌కు ఏం తెచ్చారని ధర్మపురి అర్వింద్‌ను అడుగుతున్నట్లు చెప్పారు. తాను అందిరి వాడినని తనకు కులం, మతం లేదని సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభలో అన్నారు. అన్ని మతాలను, కులాలను సమన్వయం చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. రెండుసార్లు ఎంపీగా గెలిపిస్తే నిజామాబాద్‌కు ధర్మపురి అర్వింద్ ఏం చేశారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేసిందని బీఆర్ఎస్ వాళ్లు అంటున్నారని సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా స్పందిస్తూ "లక్షల మందికి రేషన్ కార్డులు ఇచ్చాం, 3.17 కోట్ల మందికి సన్నబియ్యం ఇస్తున్నాం, గ్రూప్-1 పరీక్షలు నిర్వహించి ఉద్యోగాలు ఇచ్చామని స్పష్టం చేశారు."

## తెలంగాణలో పేదరిక నిర్మూలనకు

# సరికొత్త పథకం




**ములుగు, ఫిబ్రవరి 6:** తెలంగాణలో పేదరికాన్ని నిర్మూలించేందుకు కొత్త పథకాన్ని ప్రారంభించనున్నట్టు రాష్ట్ర మంత్రి సీతక్క ప్రకటించారు. కేరళ రాష్ట్రంలో అమలు చేసిన 'కుటుంబశ్రీ' మోడల్‌ను అనుసరిం చి ఈ పథకాన్ని రూపొం దిస్తున్నామని ఆమె తెలిపారు. కేరళలో సర్వే ద్వారా 65 వేల మంది అత్యంత పేదలను గుర్తించి.. వారిని పేదరికం నుంచి బయటకు తీసుకొచ్చినట్లు చెప్పారు. తెలంగాణలోనూ అదే తరహాలో మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా సర్వే చేయించి.. అత్యంత పేదరికంలో ఉన్నవారిని గుర్తిస్తామని వివరించారు. సర్వే తర్వాత ప్రతి కుటుంబానికి వారి అవసరాలకు తగినట్లు సహాయం అందిస్తామని సీతక్క చెప్పారు. ప్రభుత్వంపై ఆర్థిక భారం పడినా చొరవ తీసుకుంటామన్నారు. అంతేకాకుండా.. దాతలు, స్వచ్ఛంద సంస్థలు, ఇతర సంస్థలు, శ్రీమంతుల సహకారం తీసుకుంటామని తెలిపారు. త్వరలోనే మార్గదర్శకాలు రూపొందించి కార్యక్రమాన్ని అమలు చేస్తామని ప్రకటించారు. ఇప్పటికే మహిళా సంఘాలను బలోపేతం చేస్తున్నామన్నారు. ఈ కొత్త పథకం ద్వారా తెలంగాణను పేదరికం లేని రాష్ట్రంగా తీర్చిదిద్దాలనేది ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

## మరో మూడు నెలల్లో కొత్త రాజకీయ పార్టీ ప్రకటన



**హైదరాబాద్:** మరో మూడు నెలల్లో కొత్త రాజకీయ పార్టీని ప్రకటించనున్నట్లు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత వెల్లడించారు. తన రాజకీయ భవిష్యత్తుకు సంబంధించిన కీలక నిర్ణయాన్ని సరైన సమయంలో తీసుకుంటానని చెప్పారు. తనకు సెంటిమెంట్ ఎక్కువన్న ఆమె.. మంచి మూహూర్తం కోసం ఎదురు చూస్తున్నానని తెలిపారు. కొంత కాలం గడిచిన తర్వాత తన బలం ఏంటో అందరికీ అర్థమవుతుందని కవిత వ్యాఖ్యానించారు. ప్రజలే తనను నాయకురాలిగా తీర్చిదిద్దాలని, వారి మద్దతే తనకు అసలైన బలమని పేర్కొన్నారు. బీఆర్ఎస్‌తో తనకు ఒరిగిందేమీ లేదని స్పష్టం చేసిన కవిత.. భవిష్యత్తులో తన రాజకీయ ప్రయాణం పూర్తిగా ప్రజల మద్దతుపైనే ఆధారపడి ఉంటుందన్నారు. ఈ క్రమంలోనే మున్సిపల్ ఎన్నికల సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు ఎందుకు ప్రచారం చేయడం లేదని కవిత ప్రశ్నించారు. జాగృతి సంస్థ పోటీ చేస్తున్న ప్రాంతాల్లో హరీశ్ రావు ఎందుకు తిరుగుతున్నారని నిలదీశారు. అలాగే కేటీఆర్ సిరిసిల్ల నియోజకవర్గానికే ఎందుకు పరిమితమయ్యారని ఆమె ప్రశ్నల వర్షం కురిపించారు. తనపై విమర్శలు చేస్తున్న వారిపై కవిత ఘాటు వ్యాఖ్యలు చేశారు. 'గుంటనక్క, గూఢాచారి' వంటి పేర్లు వారికి నప్పుతాయి కాబట్టే అలా పిలుస్తున్నానన్నారు. రాజకీయాల్లో విమర్శలు సహజమేనని, కానీ వ్యక్తిగత ఆరోపణలు చేస్తే తాను కూడా మౌనంగా ఉండబోనని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో తన రాజకీయ వ్యూహం మరింత స్పష్టంగా ఉంటుందని, కొత్త పార్టీ ప్రకటనతో తెలంగాణ రాజకీయాల్లో కొత్త చర్చ మొదలవుతుందన్న కవిత వ్యాఖ్యలు ఇప్పుడు ప్రాధాన్యం సంతరించుకున్నాయి

## అదే నిజమైతే రాజీనామా చేస్తా



**సంగారెడ్డి జిల్లా, ఫిబ్రవరి 6:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి హరీశ్ రావు సవాల్ విసిరారు. సంగారెడ్డి జిల్లాలోని సిగాచి పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో 54 మంది మృతి చెందిన విషయాన్ని గుర్తుచేస్తూ.. ఆ బాధిత కుటుంబాలకు రేవంత్ రెడ్డి ఒక్క రూపాయి కూడా పరిహారం ఇవ్వలేదని ఆరోపించారు. 'సిగాచి ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు కోటి రూపాయల పరిహారం ఇస్తే నేను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా' అని ఛాలెంజ్ చేశారు. ప్రమాదం జరిగిన వెంటనే తాను ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా, మరుసటి రోజు మాత్రమే సీఎం వచ్చారన్నారు. కంపెనీ రూ.25 లక్షలు ఇచ్చినా.. రేవంత్ ఒక్క రూపాయి ఇవ్వలేదని విమర్శించారు. అలాగే, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన అనేక హామీలను గుర్తుచేస్తూ మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శలు గుప్పించారు. పెన్షన్‌ను 4 వేల రూపాయలకు పెంచుతామని బాండ్ పేపర్‌పై రాసిచ్చినా అమలు కాలేదన్నారు. కళ్యాణ లక్ష్మి కోసం కేసీఆర్ ఇచ్చిన లక్షా 116 రూపాయల కంటే రేవంత్ తులం బంగారం అదనంగా ఇస్తానని చెప్పి మోసం చేశారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి ఫ్రీ బస్సు పేరు చెప్పి ఓట్లు అడుగుతున్నారని.. పురుషుల బస్సు ఛార్జీలను డబుల్ చేశారని విమర్శించారు. ఇస్నాపూర్‌లో గత రెండేళ్లలో గజం రోడ్డు కూడా వేయలేదని, చిన్న డ్రైనేజీ కూడా కట్టలేదన్నారు. కరోనా సమయంలో కేసీఆర్ ప్రజలను కాపాడారని హరీశ్ రావు పేర్కొన్నారు.

## ధర్మాన్ని కాపాడుకోవడం ప్రతి హిందువు బాధ్యత



**అమరావతి:** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హిందూ ధర్మ రక్షణపై సోషల్ మీడియా వేదికగా కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రతి భక్తుడికీ తన ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందని గుర్తు చేస్తూ ఆయన ఒక సంచలన పోస్ట్‌ను పంచుకున్నారు. సాధారణంగా హిందువులు తమ దేవుళ్లను ఎవరైనా అవమానించినప్పుడు ఆ బాధను వ్యక్తిగతంగానే అనుభవిస్తూ, ఎవరు చేసిన కర్మను వారే అనుభవిస్తారనే ఉదాసీన వైఖరితో ఉంటారని, అయితే ఈ ధోరణి ఇకపై మారాలని ఆయన పిలుపునిచ్చారు. మనం కులాలు, ప్రాంతాలు, భాషల పరంగా విభజించబడి ఉన్నప్పటికీ, మనమంతా నమ్మే హిందూ ధర్మం ఒక్కటేనని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. మన విశ్వాసాలను ఉద్దేశపూర్వకంగా అవమానించినప్పుడు మౌనంగా ఉండటం సరికాదని, భక్తులుగా మాత్రమే కాకుండా ధర్మ రక్షకులుగా కూడా గొంతెత్తాలని ఆయన సూచించారు. తన సందేశం ఏ ఇతర మతాలకు వ్యతిరేకం కాదని, స్వధర్మాన్ని రక్షించుకోవడం ప్రతి ఒక్కరి కనీస బాధ్యత అని ఆయన వివరించారు. దేవుడిపై భయం, ధర్మంపై గౌరవం ఉన్న ప్రతి హిందువు ఇకపై బాధ్యతాయుతంగా స్పందించాలని పవన్ కల్యాణ్ ఆకాంక్షించారు.

## కాంగ్రెస్ బీజేపీలు తెలంగాణకు

# చేసిందేమీ లేదు

- హామీల అమలు పరిపాలన వైఫల్యాలతో తెలంగాణ ప్రజలను కాంగ్రెస్ మోసం చేస్తోంది
- కులమతాల పేరుతో ఓట్లు అడుగుతూ బీజేపీ ఎన్నికలప్పుడు ఓట్లు వేయించుకుంటది
- మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ కి ఓటు వేసి కేసీఆర్ మరోసారి సీఎం చేసుకునే ప్రస్థానాన్ని ప్రారంభించాలి
- ఆరు గ్యారెంటీలు, కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు కావాలంటే ఆ పార్టీని ఓడించాలి
- వేములవాడలో మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో కేటీఆర్



**రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 6/వేములవాడ :** కాంగ్రెస్ పార్టీ, బీజేపీ తెలంగాణకు చేసిందేమీ లేదని, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ నియోజకవర్గంలో వేములవాడ పట్టణంలో శుక్రవారం నిర్వహించుకుని మున్సిపల్ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం, బీజేపీ కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు చేస్తున్న అన్యాయాలపైన విరుచుకు పడ్డారు. కాంగ్రెస్ పార్టీ దొంగ మాటలతో అధికారంలోకి వచ్చి అడ్డగోలు హామీలు చెప్పి పదవి ఎక్కిన తర్వాత ప్రజల్ని మోసంచేస్తున్నదన్నారు. వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఎన్నికల సందర్భంగా బాండ్ పేపర్ మీద రాసి ఇచ్చి ఆరు గ్యారెంటీలు అన్నింటిని వంద రోజుల్లో అమలు చేస్తానని చెప్పిన విషయాన్ని ఆ సందర్భంగా ఆది శ్రీనివాస్ ఇచ్చిన బాండ్ పేపర్ ని ప్రజల ముందు చూపిస్తూ కేటీఆర్ మాట్లాడారు. ఈసారి తనకు ఓటు వేయకుంటే చనిపోతానని నాలుగు సార్లు ఓడిపోయినా అని చెప్పి సానుభూతి డైలాగులతో ఆరోజు ప్రజలను మభ్యపెట్టిన ఆది శ్రీనివాస్ ఆ తర్వాత హామీల అమలు నుంచి మొదలుకొని అభివృద్ధి వరకు అడ్రస్ లేకుండా పారిపోయాడన్నారు. మరోవైపు కేవలం మంత్రి పదవి కావాలన్న ఉద్దేశంతో రేవంత్ రెడ్డి కాళ్లు పట్టుకుంటున్న ఆది శ్రీనివాస్ వేములవాడ నియోజకవర్గానికి ఏమి చేశారో చెప్పాలన్నారు. ఇస్తామన్న ఆరు గ్యారెంటీలలో కనీసం ఒక్కదాన్నైనా అమలు చేశారా అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కేటీఆర్ ప్రశ్నించారు. ఒకవేళ ఇన్ని రకాల మోసాల తర్వాత, ద్రోహాల తర్వాత కూడా ఈ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే ప్రజలకు మేము చేస్తున్నదే సరైంది అని, ప్రజలు కాంగ్రెస్ కి అనుకూలంగా తీర్పు ఇస్తున్నారని రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తున్నదని, హామీల అమలు పైన భవిష్యత్‌లోనూ దృష్టి పెట్టే అవకాశమే ఉండదని కేటీఆర్ హెచ్చరించారు. అందుకే కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పిన హామీలు ముఖ్యంగా రూ.4వేల పింఛన్, ఆసరా పింఛన్ నుంచి మొదలుకొని రైతు భరోసా, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, తులం బంగారం రావాలన్నా ఖచ్చితంగా ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా ఓటు వేయాలని, అప్పుడే తాము చేస్తున్న మోసాల పైన ప్రజలు కోపంగా ఆగ్రహంగా ఉన్నారన్న విషయాన్ని తెలుసుకుంటుందన్నారు.

## టీజీ ఐసెట్ 2026 నోటిఫికేషన్ విడుదల



**రామగిరి, ఫిబ్రవరి 06 :** టీజీ ఐసెట్ 2026 నోటిఫికేషన్ విడుదలైంది. తెలంగాణ ఉన్నత విద్యా మండలి తరపున, నల్లగొండలోని ఎంజీయూ నోటిఫికేషన్‌ను వెల్లడించింది. అభ్యర్థులు అధికారిక పరీక్ష అభ్యర్థులు షెడ్యూల్ ప్రకారం దరఖాస్తు చేసుకోవాలి. అన్ రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులకు దరఖాస్తు రుసుం రూ.750, రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులు రూ.550 చెల్లించాలి. తెలంగాణలో ఎంబీఏ/ఎంసీఏ ప్రవేశాల కోసం ఎంజీయూ, నల్లగొండ మే 13 అలాగే 14 తేదీలలో టీజీ ఐసెట్ 2026 పరీక్షను నిర్వహించనుంది. 25 శాతం అర్హత కటాఫ్‌ను సాధించిన అభ్యర్థులు ప్రవేశ ప్రక్రియకు అర్హులుగా పరిగణించబడతారు. తెలంగాణలో ప్రవేశాల కోసం కేంద్రీకృత కౌన్సెలింగ్ ప్రక్రియను టీజీసహెచ్‌ఈ ఆన్‌లైన్ పద్ధతిలో నిర్వహిస్తుంది. టీజీఐసెట్ ఫలితాలు ప్రకటించిన వెంటనే తెలంగాణ ఎంబీఏ ప్రవేశాల షెడ్యూల్ విడుదల అవుతుంది. ఈ కార్యక్రమంలో వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్, టీఎస్ ఐసెట్ కన్వీనర్, ఎంజియూ రిజిస్టర్ పాల్గొన్నారు.

## మీ భూమిపై ఎవ్వరి కన్ను పడకుండా నాదీ రక్షణ



**కర్నూలు, ఫిబ్రవరి 06:** జీవితంలో ఎవరూ మీ భూమి మీద కన్ను వేయకుండా రక్షణ కల్పిస్తున్నట్లు ఏపీ ప్రజలకు సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. క్యూ ఆర్ కోడ్ వల్ల సెల్ ఫోన్‌లో మీ భూమి మీకు కనిపిస్తుందని వివరించారు. తాను నాలుగో సారి ముఖ్యమంత్రిని అయ్యానని.. ఇప్పటి వరకు తన జీవితంలో ఇన్ని భూ సమస్యలు గతంలో ఎప్పుడూ చూడలేదని తెలిపారు. శుక్రవారం కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలం కలుగొట్ల గ్రామంలో 'మీ భూమి -- మీ హక్కు' కార్యక్రమా నికి సీఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాజ ముద్రతో రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. దేశానికి అన్నం పెట్టే రైతు కరోనా సమయంలో సైతం పని చేశారని గుర్తు చేశారు. ఏపీలో ప్రతి ఎకరాకు నీరు ఇవ్వాలన్నది తన సంకల్పమని స్పష్టం చేశారు. టెక్నాలజీకి అనుగుణంగా మార్చుకుంటూ వెళ్లాల్సి ఉందన్నారు. సూపర్ సిక్స్ పథకాలను సూపర్ హిట్ చేశామన్నారు చంద్రబాబు. రాజధాని అమరావతి నిర్మాణం, పోలవరం ప్రాజెక్ట్, పరిశ్రమలతో రాష్ట్రాభివృద్ధి పరుగులు పెడుతోందని పేర్కొన్నారు. ఓర్వకల్లును తాను అభివృద్ధి చేస్తే.. వాళ్లు సర్వనాశనం చేశారన్నారు. అయినా.. మీ వారసత్వ భూమిపై వైఎస్ జగన్ ఫొటో ఏమిటని రైతులను ఆయన సూటిగా ప్రశ్నించారు. అందుకే రాజముద్రతో కొత్త పుస్తకాలు ఇచ్చి.. మీకు మళ్లీ హక్కు కల్పించానని వివరించారు. మీ జుట్టు జగన్ తన చేతుల్లో పెట్టుకుని పాలించాడని విమర్శించారు. పిల్లలు స్కూల్‌కి వెళ్లితే.. ఆయన ఫొటో చూడాలి.. పొలానికి వెళ్లితే ఆయన ఫొటో చూడాలనే విధంగా వైఎస్ జగన్ ఏర్పాటు చేశారన్నారు. ఈ దుర్మార్గుడి ఫొటో చూడాల్సిన పని ప్రజలకు ఏముందని ఆయన ప్రశ్నించారు. నూటికి 80 శాతం భూ సమస్యలు వస్తున్నాయని విమర్శించారు. లక్ష ఎకరాల ప్రైవేట్ భూములను ప్రభుత్వ భూముల రికార్డుల్లో పెట్టారని మండిపడ్డారు. తాడేపల్లె సమీపంలో 10 ఎకరాల ప్రైవేట్ భూమిని హెలిప్యాడ్‌గా మార్చుకున్నారంటూ వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ ఆగడాలను ఈ సందర్భంగా ఎండగట్టారు. 70 ఏళ్ల రికార్డున్న ఆ భూమిని ప్రభుత్వ భూమిగా రికార్డులు మార్చారని తెలిపారు. రాజకీయ లబ్ధి, వ్యక్తిగత ప్రయోజనాల కోసం అక్రమాలు, దుర్మార్గాలు చేశారని వైసీపీ అగ్రనేతల ఆగడాలను సీఎం చంద్రబాబు బహిర్గతం చేశారు.

# మున్సిపాలిటీ ఎన్నికలు 2026

**- ఎన్నికల విధుల్లో ఉన్న అధికారుల కోసం పోస్టల్ బ్యాలెట్ సౌకర్య కేంద్రాలు ఏర్పాటు**

**- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**

మెదక్ ఫిబ్రవరి 6 మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి

7,8, వ తారీకుల్లో ఎన్నికల విధులు లో ఉన్న ఉద్యోగులు వినియోగించుకునే పోస్టర్ బ్యాలెట్ కు సంబంధించి నాలుగు మున్సిపాలిటీకి సంబంధించి ఫెసిలిటేషన్ సెంటర్లో అన్ని సౌకర్యాలు. పూరి లిజిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్మున్సిపాలిటీ ఎన్నికలు -- 2026 సందర్భంగా ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు ప్రత్యేక పోస్టల్ బ్యాలెట్ సౌకర్య కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు.మెదక్ మున్సిపాలిటీలో పోస్టల్ బ్యాలెట్ సెంటర్ ను జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి సంబంధిత సిబ్బందితో కలిసి కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదక్, నర్సాపూర్, తూప్రాన్, నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఓటర్లుగా ఉన్న ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు (పో/




ఏపీవో ఓ పి ఓ ఆర్వో ఏ ఆర్ ఓ జోనల్ అధికారులు తదితరులు పోస్టల్ బ్యాలెట్ సౌకర్య (ఫెసిలిటేషన్) కేంద్రాలకు హాజరై తమ ఓటును నమోదు చేసుకోవాలని సూచించారు. పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్లలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ వివరించారు.పోస్టల్ బ్యాలెట్ సౌకర్య కేంద్రాల వివరాలు: 2026 తేదీ:07, 08, రెండు రోజులు-సమయం: ఉదయం 10:00 గంటల నుండి సాయంత్రం 4:00 గంటల వరకులి
మెదక్ మున్సిపాలిటీ ఓటర్లు:
మున్సిపల్ కార్యాలయం, మెదక్తూప్రాన్ మున్సిపాలిటీ ఓటర్లు:



మున్సిపల్ కార్యాలయం తూప్రాన్ నర్సాపూర్ మున్సిపాలిటీ ఓటర్లు: ఎంపీడీవో కార్యాలయం నర్సాపూర్ రామాయంపేట మున్సిపాలిటీ ఓటర్లు: ఎంపీడీవో, కార్యాలయంరామాయంపేటఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు తమ ఎన్నికల విధి ఆర్డర్, ఓటర్ ఐడి కార్డు మరియు ఫారం-12 (పోస్టల్ బ్యాలెట్ కోసం రిక్విజిషన్)తో సంబంధిత సౌకర్య కేంద్రానికి హాజరుకావాలి. అక్కడే పోస్టల్ బ్యాలెట్లు జారీ చేస్తారు అని వివరించారు.అధికారులు సౌకర్య కేంద్రంలోనే వెంటనే ఓటు వేసి, సంతకం చేసిన ప్రకటనతో పాటు పోస్టల్ బ్యాలెట్ను అదే రోజు అదే కేంద్రంలో సమర్పించవలసిందిగా ఆయన సూచించారు.

# ఇంద్రేశం మున్సిపాలిటీ అభివృద్ధికి కాంగ్రెస్ వైపు మొగ్గు!

**- 11వ వార్డ్ కౌన్సిలర్ అభ్యర్థిగా బూర్గుల సరిత కుమార్ గౌడ్ ప్రచారం -- స్థానిక సమస్యల పరిష్కారమే లక్ష్యం**






పటాన్‌చెరు ఫిబ్రవరి : 06(మెదక్ టుడే ( న్యూస్ ప్రతినిధి

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గం ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డు నుండి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బూర్గుల సరిత కుమార్ గౌడ్ ఎన్నికల బరిలో నిలిచారు. ఈ సందర్భంగా వార్డు పరిధిలోని సిటిజన్ కాలనీ మరియు పరిసర ప్రాంతాల్లో ఆమె విస్తృతంగా పర్యటించారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సిటిజన్ కాలనీలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని సరిత కుమార్ గౌడ్ విమర్శించారు. ప్రధానంగా తాగునీటి సమస్య మరియు డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉన్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే వార్డులో రోడ్లు, ఉచిత విద్యుత్, అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు.మట్టి రోడ్ల స్థానంలో సిసి రోడ్లు వేయడం, డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు పెద్ద పైపుల నిర్మాణం చేపడతామని స్పష్టం చేశారు.పదేళ్లలో జరిగిన అభివృద్ధిపై బీఆర్ఎస్ నాయకులను నిలదీయాలని, ఆ తర్వాతే కాంగ్రెస్ చేపట్టిన పనులను గమనించి ఓటు వేయాలని ఆమె ప్రజలను కోరారు.ఈ కార్యక్రమంలో 11వ వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకటేశం గౌడ్, కిరణ్ గౌడ్, ప్రసాద్ గౌడ్, రోహిత్ గౌడ్, సాయి గౌడ్, శివ గౌడ్, శివ, శ్రీశైలం, గోపాల్ యాదవ్, స్థానిక కాలనీ వాసులు పెద్ద ఎత్తున పాల్గొని బూర్గుల సరిత కుమార్ గౌడ్ కు మద్దతు తెలిపారు. తనను భారీ మెజారిటీతో గెలిపించాలని ఆమె ప్రజలకు విన్నవించారు.

# ప్రజలు నిర్భయంగా, స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలి

**- శాంతి భద్రతల పరిరక్షణ కోసం మెదక్ మున్సిపాలిటీ లో భారీ ఫ్లాగ్ మార్చ్.**

**- మెదక్ జిల్లా అదనపు ఎస్పీ మహేందర్**

మెదక్ ఫిబ్రవరి 6 మెదక్ టుడే న్యూస్ ప్రతినిది




. మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో, ప్రజలు ఎలాంటి భయం లేకుండా, స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా



భద్రత కల్పించడానికి మెదక్ జిల్లా పోలీస్ ఆధ్వర్యంలో భారీ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించబడింది అని అదనపు ఎస్పీ శ్రీ మహేందర్ తెలిపారు. శనివారం, జిల్లా పోలీస్ సిబ్బందితో కలిసి నిర్వహించిన ఈ ఫ్లాగ్ మార్చ్ మెదక్ టౌన్ పోలీస్ స్టేషన్ నుండి ప్రారంభమై, న్యూ బస్టాండ్, అంబేద్కర్ సర్కిల్, ఓల్డ్ బస్సు స్టాండ్, గర్ల్స్ హై స్కూల్, మార్కెట్ లోని పొట్టి శ్రీరాములు విగ్రహం, చామన్ హనుమాన్ టెంపుల్, రాందాస్ చౌరస్తా వరకు కొనసాగింది.ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మహేందర్ మాట్లాడుతూ, మున్సిపాలిటీ ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరుగేలా, ఎన్నికల సమయంలో చట్ట విరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే అవకాశం లేకుండా కఠిన చర్యలు తీసుకుంటామని, అసాంఘిక శక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా, భయభ్రాంతులకు గురికాకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని తెలిపారు. ఎన్నికల సమయంలో ఏదైనా సమస్యలు తలెత్తితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఫ్లాగ్ మార్చ్ ద్వారా ప్రజల్లో భద్రతా భావం, నమ్మకం పెరుగుతుందని, పోలీస్ శాఖ పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మెదక్ డీయస్పి ప్రసన్న కుమార్, మెదక్ టౌన్ సీఐ మహేష్, రూరల్ సీఐ జర్జ్, మెదక్ డివిజన్ ఎసైలు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# పటాన్‌చెరులో కాంగ్రెస్‌కు భారీ షాక్: హరీష్ రావు సమక్షంలో బీఆర్ఎస్‌లోకి కీలక నేతలు





పటాన్‌చెరు ఫిబ్రవరి: 06(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గ రాజకీయాల్లో పెను మార్పు చోటుచేసుకుంది. అమీన్‌పూర్ జిహెచ్ఎంసికి చెందిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. శుక్రవారం ఉదయం హైదరాబాద్‌లోని హరీష్ రావు నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో నేతలకు ఆయన గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.ఈ చేరికలలో పటాన్‌చెరు నియోజకవర్గానికి చెందిన ఉద్ధండులు ఉండటం గమనార్హం: జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, మాజీ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగ రెడ్డి , మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్,మాజీ జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, మాజీ ఎంపీపీ ఈర్ల దేవానంద్,వీరితో పాటు అమీన్‌పూర్ మాజీ కౌన్సిలర్లు పటాన్‌చెరు నియోజకవర్గ స్థాయి కీలక నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు.ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్లే నాయకులు ఆ పార్టీని వీడి వస్తున్నారని పేర్కొన్నారు. కేసీఆర్ నాయకత్వంలోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని నమ్మి వస్తున్న ప్రతి కార్యకర్తను బీఆర్ఎస్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పటాన్‌చెరు గడ్డపై మళ్లీ గులాబీ జెండా రెపరెపలాడుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్స్ కృష్ణ, ఉపేందర్ రెడ్డి, బాల్ రాజ్, యూసుఫ్ అలీ, పటాన్ చెరు నియోజకవర్గం సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకటరెడ్డి, యాదగిరి యాదవ్, విజయ్, మాజీ కార్పొరేటర్స్, కోఆప్షన్ మెంబర్స్ తలారి రాములు, చంద్రశేఖర్, మహిపాల్ రెడ్డి, మధు రెడ్డి, తుమ్మల వెంకటేశ్వర రెడ్డి, జ్ఞానేశ్వర్, కొల్లూరి యాదగిరి, కొల్లూరి గోపాల్,తుమ్మల రుశ్వంత్ రెడ్డి, సందీప్ రెడ్డి, శంకర్ రెడ్డి,లక్ష్మారెడ్డి, మహేందర్ రెడ్డి, జ్ఞానేశ్వర్, శ్రీనివాస్ గౌడ్,రవి, శ్రీనివాస్ రెడ్డి, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఎస్జీటీ పోస్టుల రద్దు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి.

**తపస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చల్లా లక్ష్మణ్ డిమాండ్.**



చేగుంట ఫిబ్రవరి 6 మెదక్ టుడే న్యూస్ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం 2325 పోస్టులు రద్దు చేసి వాటి స్థానంలో కొత్త పోస్టులు క్రియేట్ చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపే అంశాన్ని వెనక్కి తీసుకోవాలని, ప్రాథమిక పాఠశాలలు బలపడాలంటే తరగతికి ఒక ఎస్జీటీ పోస్టులను ఉండాలే కానీ, రద్దు చేయడం ఏంటని వారు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గ్రామీణ ప్రాంతాలలో పాఠశాలలు బలోపేతం కావడానికి ఎస్ జి టి పోస్ట్ లు కొనసాగించాలి. రద్దు చేస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమం లో తపస్ మండల అధ్యక్షులు రావుల వెంకటేష్, సురేందర్, సంతోష్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు 10.0000 జరిమానా జిల్లా ఎస్పీ. డి. వి. శ్రీనివాస రావు


మెదక్ ఫిబ్రవరి 6 మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి




హత్య కేసులో నిందితుడికి జిల్లా న్యాయస్థానం జీవిత ఖైదుతో పాటు రూ.10,000 జరిమానా విధించినట్లు జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు, తెలిపారు.
గడిపెద్దపూర్ గ్రామానికి చెందిన గౌరీగళ్ల యాదయ్య మద్యానికి బానిసై, ఎలాంటి ఉపాధి లేకుండా ఇంట్లోనే ఉండేవాడని, ఈ కారణంగా అతని భార్య తన ఏడు సంవత్సరాల కుమారుడిని తీసుకొని పుట్టింటికి వెళ్లిపోయిందన్నారు. ఇదిలా ఉండగా, యాదయ్య పెద్ద అన్న మొగలయ్య అనారోగ్యంతో మృతి చెందడంతో, అతని కుమారుడు మహేష్ యాదయ్యతో కలిసి ఒకే ఇంట్లో నివసిస్తూ ఉండేవాడని పేర్కొన్నారు. యాదయ్య మరియు మహేష్ ఇద్దరూ తరచూ మద్యం సేవిస్తూ చిన్నచిన్న విషయాలకే గొడవపడుతూ ఉండేవారని తెలిపారు.తేదీ 10-08-2023న ఇద్దరూ కలిసి మద్యం సేవించి నిద్రపోయారని, అర్ధరాత్రి సమయంలో ఫోన్ విషయమై యాదయ్య మహేష్ నిద్రకు భంగం కలిగించడంతో ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుందని, ఈ క్రమంలో మహేష్ యాదయ్య యొక్క చేతులు, కళ్లను కట్టేసి కర్రతో దాడి చేయడంతో యాదయ్యకు తీవ్ర గాయాలు అయ్యి మృతి చెందినట్లు వివరించారు.ఈ ఘటనపై అలాదుర్గ్ పోలీస్ స్టేషన్‌లో అప్పటి ఏఎస్ఐ దేవదాస్ కేసు నమోదు చేశారని తెలిపారు. అనంతరం అప్పటి దర్యాప్తు అధికారి జార్జ్ సమగ్రంగా దర్యాప్తు నిర్వహించి కీలక సాక్ష్యాలను సేకరించగా, ప్రస్తుత ఐఓ శంకర్ కోర్టులో సాక్షులను సమర్థవంతంగా ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. పూర్తి సాక్ష్యాలను పరిశీలించిన జిల్లా న్యాయమూర్తి నీలిమ నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ.10,000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారని జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు.ఈ కేసులో పబ్లిక్ ప్రాస్యూటర్ వెంకటేష్ సమర్థవంతమైన వాదనలు వినిపించగా, లైసనింగ్ ఆఫీసర్ ఎఎస్ఐ విఠల్, కానిస్టేబుల్ రవీందర్ గౌడ్, సీడీఓ అర్షద్ సహకరించారని తెలిపారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పోలీస్ అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు అభినందించారు.

# ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు..





పటాన్ చెరు ఫిబ్రవరి: 06(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి

సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు నియోకవర్గంలో నూతన దేవాలయాల నిర్మాణాలకు.. పురాతన దేవాలయాల జీర్ణోదారణ పనులకు సంపూర్ణ సహకారం అందిస్తూ.. ప్రతి ఒక్కరిలో దైవభక్తి పెంపొందిస్తున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్చెరు డివిజన్ పరిధిలోని చైతన్య నగర్ కాలనీలో గల శ్రీ మహాదేవ గణపతి పంచయతన రాజరాజేశ్వరి దేవి, నవగ్రహ సమేత శ్రీ అభయ ఆంజనేయ స్వామి దేవాలయం పదవ వార్షికోత్సవం కార్యక్రమానికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి దంపతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మహాశివుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పటాన్చెరు పుర ప్రముఖులు జైపాల్, సపాన దేవ్, నర్రా బిక్షపతి, వెంకటేష్. ప్రతాప్ గౌడ్, మల్లేష్ యాదవ్, శంకర్, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.


# సీఎం కప్ క్రీడా పోటీల్లో .. విజేతలకు బహుమతులు



**పాపన్నపేట,ఫిబ్రవరి,6,మెదక్ టుడే న్యూస్ :** సీఎం కప్ నియోజకవర్గ క్రీడా పోటీలు శుక్రవారం మెదక్ ప్రభుత్వ నూతన ఉన్నత పాఠశాలలో జరిగాయి. కబడ్డీ విభాగంలో పాపన్నపేట,వాలీబాల్ విభాగంలో కుర్తివాడ ఉన్నత పాఠశాలల విద్యార్థినిలు ప్రథమ స్థానంలో నిలిచి విజయం సాధించినట్లు పీడీ లు రమేష్,ప్రభాకర్ వెల్లడించారు. విద్యార్థులకు జిల్లా విద్యాధికారి విజయ లక్ష్మీ బహుమతులు అందజేశారు.

# గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్







**మంచితనం జర్నలిస్ట్ కుత్బుల్లాపూర్:** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ ఎన్నికల ఇన్చార్జిగా నియమితులైన కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మున్సిపాలిటీలోని లోని 2,5,6మరియు 17,20 వార్డులలో పార్టీ అభ్యర్థులు శిషహనాజ సమీర్, సారిక, నవ్యశ్రీ, చంద్రమౌళి, వంటేరు కొండల్ రెడ్డి రి మద్దతుగా స్థానిక గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే ప్రస్తుత నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ నర్సారెడ్డి సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆంక్ష రెడ్డి కలిసి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు...

ఈ సందర్భంగా ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఎన్నికలలో ప్రజలు ఓట్లు వేయాలని సూచించారు, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సన్న బియ్యం, ఉచిత కరెంటు, రైతు భరోసా, ఉచిత బస్సు వంటి కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు అందిస్తున్న నేపథ్యంలో ప్రజలందరూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి స్థానిక కౌన్సిలర్లను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్ మహాశయులకు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ స్థానిక కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు..

# రామేశ్వరంబండలో కాంగ్రెస్ ఎన్నికల ప్రచారం జోరు

**కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం: కాట సుధా శ్రీనివాస్ గౌడ్**





**పటాన్ చెరు ఫిబ్రవరి: 06మెదక్ టుడే న్యూస్ ప్రతిని**
మున్సిపల్ ఎన్నికల వేళ రాజకీయ సందడి మొదలైంది. ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధిలోని రామేశ్వరంబండలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. శుక్రవారం జరిగిన ప్రచార కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని అభ్యర్థుల తరపున ఓట్లు అభ్యర్థించారు.మున్సిపాలిటీలోని వివిధ వార్డుల అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ: 6వ వార్డు అభ్యర్థి నాగరాజు, 7వ వార్డు అభ్యర్థి రఘు,8వ వార్డు అభ్యర్థి మల్లేశం,9వ వార్డు అభ్యర్థి స్వామిపై అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ఆమె స్థానిక ప్రజలను కోరారు.ఈ సందర్భంగా 6వ అభ్యర్థి నాగరాజు మాట్లాడుతూ, గత ప్రభుత్వాల హయాంలో మున్సిపాలిటీ అభివృద్ధి కుంటుపడిందని విమర్శించారు. కేవలం కాంగ్రెస్ పార్టీతోనే మున్సిపాలిటీ పరిధిలో మౌలిక సదుపాయాల కల్పన మరియు సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలు ఆలోచించి, హస్తం గుర్తుపై ఓటు వేసి కాంగ్రెస్ అభ్యర్థులను ఆశీర్వదించాలని నాగరాజు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

# ఎం-ప్యానల్ లేకుండా అక్రిడేషన్ నోటిఫికేషన్ నా.?

**జర్నలిస్టులపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎందుకు ఈ చిన్నచూపు.?**

**అర్హత ఉన్న అన్ని పత్రికలను వెంటనే ఎం--పానల్ చేయాలి**

**నిజమైన జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డ్ ఇవ్వకుంటే ఉద్యమిస్తాం: టీజేఎస్ఎస్**

**పెద్ద పత్రికలకు ఒక్కరోజు ఇచ్చే అడ్వటైజ్మెంట్లతో వందల్లో చిన్న పత్రికలు బాగుపడతాయి**

**రిపోర్టర్ల పై సమాచార శాఖ మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి కక్ష కట్టారా.?**

**హైదరాబాద్:ఫిబ్రవరి,6, మెదక్ టుడే న్యూస్:(స్టేట్ బ్యూరో)**
రాష్ట్రంలో అర్హత ఉన్న పత్రికలను ఎం-ప్యానల్ చేయకుండానే అక్రిడేషన్‌కు అప్లై చేసుకోవాలని నోటిఫికేషన్ ఇవ్వడం అనేక అనుమానాలకు తావిస్తోంది.
ఇది కేవలం పరిపాలనా నిర్ణయమా.?
లేదా చిన్న పత్రికలు, నిజమైన రిపోర్టర్లను పక్కన పెట్టే కుట్రానా.? అనే ప్రశ్నలు తీవ్రంగా వినిపిస్తున్నాయని జర్నలిస్టు సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.
ఎన్నికల ముందు మీడియా, ముఖ్యంగా చిన్న పత్రికలు, ఫీల్డ్ రిపోర్టర్లు కాంగ్రెస్‌కు అండగా నిలిచారు. ప్రజా సమస్యలను ముందుకు తీసుకెళ్లారు. టిఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. అలాంటి జర్నలిస్టులే ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనగదొక్కబడుతున్నారా.? అంటే కాంగ్రెస్ ప్రభుత్వం రిపోర్టర్లను పూర్తిగా పక్కన పెట్టేయడం జరుగుతుందన్నారు.
ఎం-ప్యానల్ లేకుండా అక్రిడేషన్ అంటే ఎవరికీ లాభం.
ఎం-ప్యానల్ అనేది కేవలం ఒక అధికారిక ప్రక్రియ కాదు. పత్రిక నిజమైనదా.? క్రమం తప్పకుండా ప్రచురణ జరుగుతుందా.?
ఫీల్డ్‌లో పని చేసే రిపోర్టర్లు ఉన్నారా.? ప్రజా సమస్యలపై కథనాలు వస్తున్నాయా.? ఈ విషయాలన్నిటిని డిపిఆర్వోలు ఐ అండ్ పి ఆర్ పర్యవేక్షించాలి. కానీ వాళ్ళ పర్యవేక్షణ ఎక్కడ.?
జిల్లా డిపిఆర్ఓ ల వద్ద జిల్లాలో పనిచేసే రిపోర్టర్ల సమాచారం ఉందా.? ఎం పానెల్ చేయకుండా అక్రిడేషన్ ఇస్తే పేపర్ మీద మాత్రమే ఉన్న పత్రికలు, అధికార పార్టీకి అనుకూలంగా పనిచేసే బినామీ మీడియా సంస్థలకే దారితీయదా.?
దీని వల్ల నిజంగా రోడ్డెక్కి వార్తలు తెచ్చే గ్రౌండ్ రిపోర్టర్లు తీవ్రంగా నష్టపోతారు. ఈ విషయం సమాచార శాఖ మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి ఎందుకు గుర్తించడం లేదు.
చిన్న పత్రికలు అంటే సీఎం రేవంత్ రెడ్డికి గిట్టదా.?
గత కెసిఆర్ ప్రభుత్వంలో చిన్న పత్రికలకు తీవ్ర అన్యాయం జరిగిందని ప్రతిపక్షంలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలుమార్లు మీడియా ముఖంగా ప్రశ్నించారు. ప్రస్తుతం రేవంత్ సర్కార్ అధికారంలో ఉంది మరి చిన్న పత్రికలకు మీడియాకు ఎందుకు అన్యాయం చేస్తున్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చెప్పిన మాటలు అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరిచిపోయారా.? పెద్ద పత్రికలకు ఒక్కరోజు ఇచ్చే అడ్వటైజ్మెంట్ ఖర్చులలో దాదాపు చిన్న పత్రికలు అన్ని బతికి బట్ట కడతాయి. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి ఎందుకు అర్థం చేసుకోవడం లేదు అధికారంలోనికి రావడానికి చిన్న పత్రికల సహాయం కావాలి వచ్చిన తర్వాత తొక్కి వేయాలి ఇదేనా.?
ఈ నిర్ణయంతో ఒక ప్రశ్న స్పష్టంగా వినిపిస్తోంది,
"చిన్న పత్రికలు అంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి గిట్టదు అని"
పెద్ద పత్రికలకు కోట్ల రూపాయల ప్రకటనలు,
చిన్న పత్రికలకు మాత్రం ఎంపానెల్ లేదు. భరోసా లేదు. గుర్తింపు లేదు,
ఇదేనా ప్రజా పాలన.?
ఇదేనా కాంగ్రెస్ ప్రభుత్వం మీడియాకు ఇచ్చిన గౌరవం.?
జర్నలిస్టులతోనే అధికారంలోకి వచ్చి,
మీడియా స్వేచ్ఛ గురించి మాట్లాడిన కాంగ్రెస్ ప్రభుత్వం,
ఈరోజు అదే మీడియాను నియంత్రించే ప్రయత్నం చేస్తోందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.
నచ్చినవారికి అక్రిడేషన్,
ప్రశ్నించేవారికి నిరాకరణ..
జర్నలిస్టుల విషయంలో సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నిర్ణయాలు ప్రజాస్వామ్యానికి ప్రమాదకర సంకేతం కాదా.? మొదటగా అర్హత ఉన్న చిన్న పత్రికలకు ఏం ప్యానల్ చేయాలనిప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్న పట్టించుకోకపోవడం బాధాకరంగా మారింది.కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ముందుగా అర్హత ఉన్న పత్రికలను వెంటనే ఎం-ప్యానల్ చేయాలి. ఆ తర్వాతే అక్రిడేషన్ ప్రక్రియ చేపట్టాలి.చిన్న పత్రికలు, నిజమైన రిపోర్టర్లకు న్యాయం చేయాలి. లేకపోతే ఇది మీడియాపై దాడిగా, స్వేచ్ఛను హరించే చర్యగా చరిత్రలో మిగిలిపోతుందని తెలంగాణ జర్నలిస్టుల సంక్షేమ సంఘం పేర్కొంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
జర్నలిస్టులను చిన్నచూపు చూడడం ద్వారా కాదు
వారికి గౌరవం ఇవ్వడం ద్వారా మాత్రమే
ప్రభుత్వం బలపడుతుందని టీజేఎస్ఎస్ సూచించింది.

# పంచాయతీ కార్యదర్శి పై చర్యలు తీసుకోండి

**-ఎంపీడీవోకి ఫిర్యాదు చేసిన బండరావిరాల సర్పంచ్ కందికంటి విజయ్ కుమార్**






నిబంధనలకు విరుద్ధంగా,రాజకీయ తొత్తుగా మారిన బండరావిరాల పంచాయతీ సెక్రటరీ పి.నవనీత రెడ్డిని వెంటనే సస్పెండ్ చేయాలి అని సర్పంచ్ కందికంటి విజయ్ కుమార్ ఎంపీడీవో శ్రీవాణికి ఫిర్యాదు చేశారు.గ్రామంలోని ఉమామహేశ్వర స్వామి దేవాలయ జాతర నిర్వహణ విషయంలో నిబంధనలను తుంగలో తొక్కి,కాంగ్రెస్ పార్టీ నాయకులకు కొమ్ముకాస్తున్న గ్రామ పంచాయతీ సెక్రటరీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో 2025 డిసెంబర్ 10 న కేవలం 7 రోజులలో ఎలక్షన్స్ ఉండగా ఎటువంటి గ్రామ సభ నిర్వహించకుండా,ప్రజల అభిప్రాయాలను తీసుకోకుండా,ఎలాంటి తీర్మానం లేకుండా కొత్త ప్రభాకర్ గౌడ్ అడగగానే గుడిని దేవాదాయ శాఖలో కలపాలని సెక్రటరీ ఏకపక్షంగా లేఖ ఇచ్చారని మండిపడ్డారు.దీనికి సంబంధించిన ఆఫీస్ కాపీని రికార్డుల్లో భద్రపరచకుండా విధి నిర్వహణలో ఆమె ఘోరంగా విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు.అంత పెద్ద నిర్ణయం తీసుకునే లెటర్ ఆఫీస్ కాపీ ఎందుకు లేదో గ్రామ ప్రజలకు సమాధానం చెప్పాలి అన్నారు.2025 డిసెంబర్ 22,న నూతన పాలకవర్గం అధికారికంగా పదవీ బాధ్యతలు స్వీకరించి బాధ్యతల్లో ఉన్నప్పటికీ,2026 జనవరి 3 న దేవాదాయ శాఖ నుండి వచ్చిన అభ్యంతరాల నోటీసుపై సెక్రటరీ గ్రామ పంచాయతీ స్టాంపు వేసి,సంతకం చేసి కూడా కనీస సమాచారం ఇవ్వకుండా దాచిపెట్టారని వాపోయారు.పాలకవర్గం ఉండగా,ఒక ప్రభుత్వ అధికారిణి ఇలా రహస్యంగా వ్యవహరించడం ఆమె రాజకీయ పక్షపాతానికి నిదర్శనమన్నారు.?జాతర సన్నాహాల కోసం సర్పంచ్ జనవరి 25న సమావేశం ఏర్పాటు చేయగా,సర్పంచ్ ని అభాసుపాలు చేయాలనే ఉద్దేశంతో ముందు రోజు రాత్రి 10 గంటలకు స్థానిక కాంగ్రెస్ నాయకులు ఒక చీకటి లేఖను వాట్సాప్ గ్రూపుల్లో విడుదల చేశారని పేర్కొన్నారు.జనవరి 26న జరిగిన గ్రామసభలో సెక్రటరీ ప్రజలందరి ముందు తనకు ఎటువంటి నోటీసులు రాలేదని పచ్చి అబద్ధాలు చెప్పి గ్రామస్తులను తప్పుదోవ పట్టించారని,జనవరి 3వ తేదీనే సంతకం చేసిన అధికారిణి 26న తెలియదని చెప్పడం ఆమె మోసపూరిత వైఖరికి నిదర్శనమని మండిపడ్డారు.?దేవాలయ స్థలం వాస్తవానికి 500నుండి 600 గజాలు గజాలు ఉంటే,తప్పుడు లెక్కలతో 1200 గజాలు అని పేర్కొని ఉన్నతాధికారులను సైతం మోసం చేశారని విజయ్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు.ఒక దళిత సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి సర్పంచ్‌గా ఎన్నికవ్వడాన్ని జీర్ణించుకోలేక అగ్రకుల మాజీ సర్పంచ్‌లతో చేతులు కలిపి తన హక్కులను కాలరాయాలని చూడటం రాజ్యాంగ విరుద్ధమని అన్నారు.రాజకీయ కక్ష సాధింపులకు సహకరిస్తున్న సెక్రటరీని వెంటనే సస్పెండ్ చేయాలని,జాతరను గ్రామ ఆనవాయితీ ప్రకారం నిర్వహించేలా చూడాలని ఉన్నతాధికారులను డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచి వెంట గ్రామ ఉపసర్పంచ్ దూస శంకర్ ముదిరాజ్,గ్రామ వార్డు సభ్యులు కన్నె భరత్ యాదవ్,యేడవల్లి సుస్మిత రమేష్,ఏర్పుల హరికృష్ణ,గ్రామ సీనియర్ నాయకులు మొలుగు దానేష్,కవాడి దయాకర్ రెడ్డి,మంకిరి శ్రీనివాస్,కూర కృష్ణ ముదిరాజ్,కందికంటి దానేష్,కొండ రాజేష్ యాదవ్,గుండ్ల సతీష్ యాదవ్ ఉన్నారు.

# నెహ్రూ వల్లే చైనా చేతిలో ఓడిపోయాం- నిజాలున్నా 'బ్రూక్స్ - భగత్' నివేదికపై మేం రాజకీయం చేయలేదు



కాంగ్రెస్ పార్టీ లేవనెత్తిన మాజీ ఆర్మీ చీఫ్ ఎంఎం నరవణె పుస్తకం వ్యవహారానికి కౌంటర్ ఇస్తూ కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరెణ్ రిజిజు కీలక వ్యాఖ్యలు చేశారు. 1962 యుద్ధంలో చైనా చేతిలో భారత్ ఘోర ఓటమికి నాటి నెహ్రూ ప్రభుత్వ తప్పుడు నిర్ణయాలే కారణమనే అంశం 'హెండెర్సన్ బ్రూక్స్ - భగత్' నివేదికలో ఉందని ఆయన తెలిపారు. ఈవిషయం తెలిసినప్పటికీ ఆ నివేదికను అధికార రహస్యం (క్లాసిఫైడ్)గానే ఉంచాలని మోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని రిజిజు చెప్పారు. ముమ్మాటికీ ఈ నిర్ణయం సరైందేనన్నారు.'హెండెర్సన్ బ్రూక్స్ - భగత్' నివేదిక దేశ రక్షణతో ముడిపడిన సున్నితమైన అంశమైనందున, దాన్ని తాము రాజకీయ అస్త్రంగా వినియోగించలేదన్నారు. ఈ మేరకు శుక్రవారం రిజిజు ఒక ట్వీట్ చేశారు. 2024 నవంబరు 1న ఎక్స్ వేదికగా తాను చేసిన ఒక ట్వీట్‌ను ఆయన ఇప్పుడు మళ్లీ షేర్ చేశారు. ఆ రోజున చైనా సరిహద్దుల్లోని అరుణాచల్ ప్రదేశ్ పట్టణం బుమ్లాలో భారత ఆర్మీ జవాన్ల దీపావళి వేడుకల్లో కేంద్ర మంత్రి రిజిజు పాల్గొన్నారు. చైనా సరిహద్దుల్లో భారత ఆర్మీ మౌలిక సదుపాయాలను మోదీ సర్కారు బలోపేతం చేసిన అంశం గురించి అప్పటి ట్వీట్‌లో ఆయన రాసుకొచ్చారు. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు బడ్జెట్ సెషన్‌లో మాజీ ఆర్మీ చీఫ్ జనరల్ ఎంఎం నరవణె రాసిన "ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ' పుస్తకం హాట్ టాపిక్‌గా మారింది. దీనిలోని పలు అంశాలను ప్రస్తావిస్తూ లోక్‌సభలో మాట్లాడేందుకు ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రయత్నించారు. అయితే అందుకు లోక్‌సభ స్పీకర్ అనుమతించలేదు. ఎంఎం నరవణె పుస్తకంలోని అంశాలపై సభలో మాట్లాడటానికి వీలు లేదన్నారు.ఎంఎం నరవణె పుస్తకంలో ఏముంది ?రాహుల్ గాంధీ తాజాగా చేసిన వ్యాఖ్యల ప్రకారం, మాజీ ఆర్మీ చీఫ్ నరవణె రాసిన 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ' పుస్తకం విదేశాల్లో పబ్లిష్ అయింది. ఈ బుక్ 2024 ఏప్రిల్‌లోనే భారత్‌లో విడుదల కావాల్సి ఉండగా, దానికి భారత రక్షణ శాఖ ఆమోదం లభించలేదన్నారు. దీంతో ఈ బుక్?ను పెంగ్విన్ పబ్లిషర్స్ సంస్థ మన దేశంలో అధికారికంగా పబ్లిష్ చేయలేదని రాహుల్ చెప్పారు. 2020లో తూర్పు లద్దాఖ్ సరిహద్దుల్లోకి చైనా యుద్ధ ట్యాంకులు ప్రవేశిస్తున్నాయని, తాము ఏం చేయాలని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఎన్ఎస్ఏ అజిత్ దోవల్‌లను అప్పటి ఆర్మీ చీఫ్ నరవణె సంప్రదించారన్నారు.కానీ ఆయనకు నేరుగా సమాధానం లభించలేదని రాహుల్ పేర్కొన్నారు. దీంతో ప్రధాని మోదీని ఎంఎం నరవణె సంప్రదించగా, 'మీకు ఏది కరెక్ట్ అనిపిస్తే, అది చేయండి' అని మోదీ చెప్పారన్నారు. మొత్తం బాధ్యతనంతా తనపైనే వేసి, ప్రభుత్వంలోని పెద్దలు తప్పించుకోవడంతో ఆనాడు తాను పూర్తిగా ఒంటరి అయ్యాను అనే అంశాన్ని పుస్తకంలో నరవణె రాసుకున్నారని రాహుల్ గాంధీ వివరించారు.ఏమిటీ 'హెండెర్సన్ బ్రూక్స్ - భగత్' నివేదిక థామస్ బ్రియాన్ హెండెర్సన్ బ్రూక్స్ 1909లో బర్మాలో జన్మించారు. ఈయన 1929 నుంచి 1947 వరకు భారత్‌లోని బ్రిటీష్ ప్రభుత్వ ఆర్మీలో అధికారిగా పనిచేశారు. దేశానికి బ్రిటీష్ వాళ్ల నుంచి స్వాతంత్ర్యం వచ్చాక, భారత ఆర్మీలోనూ ఆఫీసరుగా పనిచేశారు. 1947 నుంచి 1964 వరకు భారత ఆర్మీలో జనరల్ ఆఫీసర్ హోదాలో సేవలు అందించారు. భారత ఆర్మీ బ్రిగేడియర్ పీఎస్ భగత్, థామస్ బ్రియాన్ హెండెర్సన్ బ్రూక్స్‌లతో కూడిన దర్యాప్తు టీమ్ 1962 భారత్ - చైనా యుద్ధంపై సమీక్షా నివేదికను రూపొందించింది. దీన్నే 'హెండెర్సన్ బ్రూక్స్ - భగత్' నివేదిక అంటారు.

# దళపతి విజయ్‌కి షాక్ ఇచ్చిన కోర్టు ఆ పిటిషన్ కొట్టివేత




**చెన్నై, ఫిబ్రవరి 6:** తమిళ స్టార్ హీరో, తమిళగ వెట్రి కళగం(టీవీకే) పార్టీ అధినేత దళపతి విజయ్‌కి మద్రాస్ హైకోర్టు షాక్ ఇచ్చింది. విజయ్ వేసిన పిటిషన్‌ను కోర్టు కొట్టివేసింది. ఆదాయ పన్ను పెనాల్టీకి సంబంధించి విజయ్ వేసిన రిట్ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ సెంథిల్ కుమార్ శుక్రవారం విచారణ జరిపారు. ఆదాయ పన్ను శాఖకు అనుకూలంగా తీర్పునిచ్చారు. విజయ్ పిటిషన్‌ను కొట్టివేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఇంతకీ ఏం జరిగిందంటే..2015 సంవత్సరంలో ఆదాయ పన్ను శాఖ అధికారులు విజయ్ ఇంట్లో సోదాలు నిర్వహించారు. దళపతి విజయ్‌కి మద్రాస్ హైకోర్టు షాక్ ఇచ్చింది. విజయ్ వేసిన పిటిషన్‌ను కోర్టు కొట్టివేసింది. విజయ్ వేసిన రిట్ పిటిషన్‌పై జస్టిస్ సెంథిల్ కుమార్ శుక్రవారం విచారణ జరిపారు. ఆదాయ పన్ను శాఖకు అనుకూలంగా తీర్పునిచ్చారు.పలు పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. కొన్ని నెలల తర్వాత విజయ్ ఆదాయ పన్ను రిటర్న్ ఫైల్ చేస్తూ.. 2015-16 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తనకు 35.42 కోట్ల రూపాయలు ఆదాయం వచ్చినట్లు చూపించారు. అయితే పులి సినిమా కోసం ఆయన తీసుకున్న 15 కోట్ల రూపాయలు ఆ లెక్కలో చూపించలేదని అధికారులు గుర్తించారు. 1.5 కోట్ల రూపాయల పెనాల్టీ వేస్తూ 2022 జూన్ 30వ తేదీన నోటీసులు ఇచ్చారు.ఆదాయ పన్ను శాఖ అధికారుల నోటీసులకు వ్యతిరేకంగా విజయ్ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. కోర్టులో రిట్ పిటిషన్ వేశారు. సింగిల్ జడ్జి ఈ పిటిషన్‌పై విచారణ జరిపారు. ఆదాయ పన్ను శాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకుండా 2022 ఆగస్టు 16న ఇంటీరియమ్ స్టే వేశారు. శుక్రవారం ఈ పిటిషన్‌పై మరోసారి విచారణ జరిగింది. జస్టిస్ సెంథిల్ కుమార్.. విజయ్ వేసిన పిటిషన్‌ను కొట్టి వేశారు.

# న్యాయవేదికను ప్రచారానికి వాడుకుంటున్నారా



**న్యూఢిల్లీ:** గత ఏడాది నవంబర్‌లో జరిగిన బిహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను సవాలు చేస్తూ జన్ సురాజ్ (పార్టీ చీఫ్ ప్రశాంత్ కిశోర్ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు శుక్రవారంనాడు కొట్టివేసింది. ఈ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది.అసెంబ్లీ ఎన్నికల్లో అధికార జనతా దళ్ (యునైటెడ్), భారతీయ జనతా పార్టీ కూటమి ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించిందని ప్రశాంత్ కిశోర్ తమ పిటిషన్‌లో ఆరోపించారు. ఓటింగ్‌కు ముందు మహిళా ఉపాధి పథకం కింద లబ్ధిదారులైన ఒక్కో మహిళకు రూ.10 వేలు పంపిణీ చేశారని, ఇది ఎన్నికల ఫలితాన్ని ప్రభావితం చేసిందని అన్నారు. కూటమి గెలుపు చెల్లదని ప్రకటించాల్సిందిగా కోర్టును కోరారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో తొలిసారి పోటీ చేసిన జన్‌సురాజ్ పార్టీ 238 స్థానాల్లో ఒక్క సీటును కూడా గెలుచుకోలేదు. కాగా, ప్రశాంత్ కిశోర్ పిటిషన్‌పై విచారణకు భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ సారథ్యంలోని ధర్మాసనం నిరాకరించింది. 'మీ పార్టీకి ఎన్ని ఓట్లు వచ్చాయి? ప్రజలే మీ పార్టీని వద్దనుకున్నారు. ఇప్పుడు ప్రచారం కోసం ఈ న్యాయవేదికను వాడుకోవాలనుకుంటున్నారా?' అని సీజేఐ ప్రశ్నించారు.ఎన్నికల్లో ఓడిపోయినందున మొత్తం ఫలితాన్ని పక్కన పెట్టాలని మీరు కోరుతున్నారని, దీనిపై హైకోర్టుకు ఎందుకు వెళ్లలేదని ప్రశాంత్ కిషోర్ న్యాయవాదులను ధర్మాసనం నిలదీసింది. 'ఇదేమీ పాన్-ఇండియా అంశం కాదు. మీ రాష్ట్రంలో హైకోర్టు ఉంది. ఏమైనా ఫిర్యాదులు ఉంటే అక్కడికి వెళ్లండి' అని స్పష్టం చేసింది.

# గడ్చిరోలిలో కాల్పుల కలకలం ముగ్గురు మావోయిస్టుల మృతి



**మహారాష్ట్ర –** ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతాల్లో పోలీస్ భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురుకాల్పులు తీవ్ర ఉద్రిక్తతకు దారితీశాయి. గడ్చిరోలి అడవుల్లో జరిగిన ఈ కాల్పుల ఘటనలో భారీ నష్టం వాటిల్లింది. అటవీ ప్రాంతంలో మావోయిస్టుల కదలికలు ఉన్నాయని ఇంటెలిజెన్స్ సమాచారం అందడంతో.. పోలీసులు, భద్రతా బలగాలు నిన్నటి(గురువారం) నుంచి గాలింపు చర్యలు చేపట్టాయి. భద్రతా బలగాలు అడవిలోకి ప్రవేశించగానే మావోయిస్టుల వైపు నుంచి కాల్పులు మొదలయ్యాయి. ప్రతిగా బలగాలు జరిపిన కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మరణించారు. ఈ హోరాహోరీ పోరులో కమాండో దీపక్ ప్రాణాలు కోల్పోగా, గాయపడిన మరో అధికారిని మెరుగైన చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ఘటనాస్థలిలో ఏకే-47, వ్రా= స్వాధీనం చేసుకున్నాయి భద్రతా బలగాలు.కొనసాగుతున్న ఆపరేషన్..ఘటనా స్థలంలో పోలీసులు.. ఆయుధాలు, విప్లవ సాహిత్యం, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఆ ప్రాంతంలో ఇంకా కొందరు మావోయిస్టులు దాగిఉండే అవకాశముందని పోలీసులు భావిస్తున్నారు. ఈ ఎన్‌కౌంటర్‌తో గడ్చిరోలి జిల్లాలో ఉత్కంఠ వాతావరణం నెలకొంది. స్థానికులను అప్రమత్తం చేసిన అధికారులు.. అటవీ ప్రాంతాల వైపు వెళ్లవద్దని సూచనలు జారీ చేశారు. ఎన్‌కౌంటర్ పూర్తైన తర్వాత మృతుల సంఖ్య, స్వాధీనం చేసుకున్న ఆయుధాల వివరాలను అధికారికంగా వెల్లడిస్తామని పోలీస్ ఉన్నతాధికారులు స్పష్టం చేశారు.

# మోదీ మాట్లాడకపోవడం నిబంధనలకు విరుద్ధం- సభకు వివరించాల్సిందే'- స్పీకర్‌కు కాంగ్రెస్ లేఖ




**న్యూఢిల్లీ:** లోక్‌సభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ ముగింపు సందర్భంగా అనుసరించాల్సిన విధానాలు పాటించలేదని కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆ అంశంపై లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు ఆయన లేఖ రాస్తూ, జరిగిన పరిణామాలను సభకు స్పష్టంగా వివరించాలని కోరారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సమాధానం లేకుండానే ధన్యవాద తీర్మానాన్ని ఆమోదించడం పార్లమెంటరీ సంప్రదాయాలకు విరుద్ధమని పేర్కొన్నారు.పలు నియమాలను ప్రస్తావించిన వేణుగోపాల్ గురువారం లోక్‌సభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ జరిగింది. అయితే ప్రతిపక్షాల ఆందోళనలు, నినాదాల మధ్య ప్రధానమంత్రి ప్రసంగం చేయకుండానే తీర్మానాన్ని ఓటింగ్‌కు పెట్టి ఆమోదించడం అసాధారణ పరిణామంగా మారింది. ఇది ఇప్పటివరకు అరుదుగా జరిగిన సంఘటనగా రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలో స్పీకర్‌కు రాసిన లేఖలో వేణుగోపాల్ పలు నియమాలను ప్రస్తావించారు.సభకు తెలియజేయాల్సిన బాధ్యత ఆయనదే!లోక్‌సభ నియమావళి ప్రకారం రూల్ 20 కింద ధన్యవాద తీర్మానంపై చర్చ ముగింపులో ప్రభుత్వ వైఖరిని ప్రధానమంత్రి స్వయంగా వివరణ ఇవ్వడం తప్పనిసరి అని తెలిపారు. ఏదైనా కారణంతో ప్రధాని సమాధానం ఇవ్వలేకపోతే, ఆ విషయాన్ని సభకు తెలియజేయాల్సిన బాధ్యత ఆయనదేనని గుర్తుచేశారు. కానీ ప్రస్తుత సందర్భంలో ప్రధాని ప్రసంగం లేకపోవడమే కాకుండా, సభకు ఎటువంటి సమాచారం ఇవ్వలేదని విమర్శించారు. ఇది రూల్ 20 స్పష్టమైన ఉల్లంఘనగా పేర్కొన్నారు.రూల్ 362 ప్రకారం ప్రత్యేక తీర్మానం తీసుకు రావాలి!అదేవిధంగా, సాధారణంగా చర్చ ముగింపులో సంబంధిత మంత్రి సమాధానం ఇవ్వడం పార్లమెంటరీ పద్ధతి అని చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో సమాధానం లేకుండానే చర్చ ముగించాలంటే రూల్ 362 ప్రకారం ప్రత్యేక తీర్మానం తీసుకురావాల్సి ఉంటుందని తెలిపారు. ఆ తీర్మానాన్ని స్పీకర్ సభ ముందుంచి ఆమోదం పొందిన తర్వాతే చర్చ ముగిసినట్లు పరిగణించాలన్నారు.సభ్యుల మాట స్వేచ్ఛను కాపాడాల్సిన బాధ్యతకానీ గురువారం జరిగిన ప్రక్రియలో అలాంటి తీర్మాం ఏదీ తీసుకురాలేదని, అయినప్పటికీ మధ్యాహ్నం సుమారు 12 గంటల సమయంలో హఠాత్తుగా ధన్యవాద తీర్మానాన్ని ఓటింగ్‌కు పెట్టి ఆమోదించారని వేణుగోపాల్ ఆక్షేపించారు. ఇది రూల్ 362కు కూడా విరుద్ధమని పేర్కొన్నారు. స్పీకర్ రాజ్యాంగబద్ధంగా సభా నియమాల సంరక్షకుడని, సభ్యుల మాట స్వేచ్ఛను కాపాడాల్సిన బాధ్యత ఆయనదని వేణుగోపాల్ లేఖలో గుర్తుచేశారు.ఆ ప్రశ్నలకు స్పష్టతనివ్వాలని కోరిన ఎంపీరాజ్యాంగంలోని ఆర్టికల్ 105 సభ్యులకు మాట్లాడే హక్కును ఇస్తుందని, ఆ హక్కు పూర్తిగా వినియోగించుకునేలా చూడటం స్పీకర్ ధర్మమని పేర్కొన్నారు. అలాగే ఆర్టికల్ 75(3) ప్రకారం ప్రధానమంత్రి ప్రభుత్వ తరఫున సభకు బాధ్యత వహించాల్సిన రాజ్యాంగ బాధ్యత ఉందన్నారు. "ప్రధానమంత్రి సమాధానం ఎందుకు లేకపోయింది? చర్చను ఎలాంటి విధానంతో ముగించారు? ఏ నియమాల ప్రకారం తీర్మానాన్ని ఓటింగ్‌కు పెట్టారు?" వంటి ప్రశ్నలకు స్పష్టత ఇవ్వాలని ఆయన స్పీకర్‌ను కోరారు. సంబంధిత నియమాలు, అనుసరించిన విధానం గురించి సభకు వివరాలు తెలియజేస్తే సభ్యులకు స్పష్టత వస్తుందని అన్నారు.కాగా, ప్రధాని ప్రసంగం లేకుండానే రాష్ట్రపతికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం లోక్‌సభలో ఆమోదం పొందింది. అయితే ప్రధాని కూర్చున్న చోటకు వచ్చి కాంగ్రెస్ ఎంపీలు అనూహ్య చర్యకు పాల్పడతారనే కచ్చితమైన సమాచారం ఉందని, అందుకే గురువారం ఆయనను సభకు రావొద్దని తానే సూచించానని స్పీకర్ ఓం బిర్లా ఇప్పటికే తెలిపారు. ఒకవేళ అలాంటి ఘటన జరిగితే దేశ ప్రజాస్వామ్య సంప్రదాయానికి తీవ్ర విఘాతం కలిగేదని స్పష్టం చేశారు. "బుధవారం సభలో కొందరు సభ్యుల ప్రవర్తన సరిగా లేదు. ఇలాంటి పరిస్థితిని గతంలో ఎన్నడూ చూడలేదు. ఇది ఎంతో బాధాకరం. మాయని మచ్చ" అని ఓం బిర్లా వ్యాఖ్యానించారు. తన సూచనను గౌరవించి ప్రధాని సభకు రాకుండా ఉన్నందుకు కృతజ్ఞతలు తెలిపారు.

# లోక్‌సభలో కొనసాగిన గందరగోళం సోమవారానికి వాయిదా



**న్యూఢిల్లీ:** లోక్‌సభ లో గందరగోళం కూడా కొనసాగింది. రాజ్యసభ లో గురువారం ప్రధాని మోదీ మాట్లా డుతూ చేసిన విమర్శలపై విపక్ష సభ్యులు అభ్యంతరం వ్యక్తంచేశారు. లోక్‌సభలో తమ నాయకుడికి మాట్లాడే అవకాశం ఎందుకు ఇవ్వడంలేదని ప్రశ్నించారు. పలువురు సభ్యులు ప్రభుత్వానికి వ్యతిరే కంగా నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. స్పీకర్ నచ్చజెప్పే ప్రయత్నం చేసినా వారు వినిపించుకోకపోవడంతో సభను సోమవారానికి వాయిదా వేశారు. లోక్‌సభలో ఈ బడ్జెట్ సెషన్‌లో ఇప్పటికే 19 గంటల 13 నిమిషాల సమయం వృథా అయ్యిందని స్పీకర్ తెలిపారు. సభను సోమవారం ఉదయం 11 గంటల వరకు వాయిదా వేస్తున్నట్లు ప్రకటిం చారు. కాగా పార్లమెంట్‌లో తొలి విడత బడ్జెట్ సమావేశాలు ఈ నెల 13తో ముగియనున్నాయి. మార్చి 9న రెండో విడత సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఫిబ్రవరి 9 నుంచి లోక్‌సభలో బడ్జెట్‌పై చర్చ జరుగనుంది.

# 'మీకు ఏది సరైనదనిపిస్తే అదే చేయండి'- మోదీ ప్రసంగంపై రాహుల్ సెటైరిం




**న్యూఢిల్లీ:** రాజ్యసభలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగంపై కాంగ్రెస్ అగ్ర నాయకుడు, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ స్పందించారు. జో ఉచిత్ సమ్జో వహీ కరో (మీరు సరైనది అనుకున్నది చేయండి) అంటూ వ్యంగ్యంగా విమర్శించారు. పార్లమెంట్‌మకర్ ద్వార్ వద్ద కాంగ్రెస్ సహా ప్రతిపక్ష ఎంపీలు శుక్రవారం ఉదయం చేపట్టిన నిరసనలో పాల్గొన్న రాహుల్, ఈ మేరకు పలు వ్యాఖ్యలు చేశారు.శుక్రవారం ఉదయం పార్లమెంట్ మకర్ ద్వార్ వద్ద కాంగ్రెస్ సహా ప్రతిపక్ష ఎంపీలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జో ఉచిత్ సమ్జో వహీ కరో అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఆందోళన కొనసాగించారు. భారత్?, అమెరికా డీల్?ను ట్రాప్ డీల్‌గా వర్ణిస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఆ సమయంలో వారితోపాటు రాహుల్ గాంధీ కూడా పాల్గొని నినాదాలు చేశారు. అప్పుడే మీడియాతో మాట్లాడుతూ, జో ఉచిత్ సమ్జో వహీ కరో అంటూ విమర్శించారు.అదే సమయంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా మోదీ ప్రసంగం తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రభుత్వం వాస్తవాలను దాచిపెడుతోందని, ప్రతిపక్షం లేవనెత్తిన కీలక అంశాలకు ప్రధాని సమాధానం ఇవ్వకుండా తప్పించుకున్నారని ఆరోపించారు. ప్రధాని ప్రసంగ సమయంలో ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేస్తూ వాకౌట్ చేసిన విషయం తెలిసిందే. జాతీయ భద్రత, చైనా అంశాలపై తమ ఆందోళనలకు సరైన సమాధానం రాలేదనే కారణంతో సభను బహిష్కరించామని ఖర్గే తెలిపారు."ప్రధాని ప్రసంగానికి స్పందించాల్సిన అవసరం లేదు. కానీ ఆయన చెప్పిన అసత్యాలకు సమాధానం ఇవ్వాల్సి వస్తోంది. అబద్ధాలను పదేపదే చెప్పడం ఆయన అలవాటైపోయింది" అని ఖర్గే విమర్శించారు. 97 నిమిషాల ప్రసంగంలో ప్రధాని గత 100 ఏళ్లు, 75 ఏళ్లు, 50 ఏళ్ల చరిత్ర గురించి మాత్రమే మాట్లాడారని, కానీ ప్రస్తుత సమస్యలపై స్పష్టత ఇవ్వలేదన్నారు. మాజీ ఆర్మీ చీఫ్ జనరల్ ఎం.ఎం. నరవాణే రాసిన స్మృతిగ్రంథం (మెమోయర్) అంశాన్ని ప్రస్తావిస్తూ ఎందుకు ఇబ్బందిపడింది?"ఆ పుస్తకం ఇప్పటికే ప్రచురితమై మా చేతుల్లో ఉంది. అయితే అది ప్రచురించలేదని రక్షణ మంత్రి మెంట్‌లో ఎలా చెబుతారు? ఇది మీ కళ్ల ముందే ఉన్న విషయం" అంటూ ప్రశ్నించారు. హోంమంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కూడా అదే విషయాన్ని పునరావృతం చేశారని, చివరికి రాహుల్ గాంధీ సభలో పుస్తకాన్ని చూపించిన తర్వాత నిజం బయటపడింద\్నారు. అలాగే లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చైనా అంశాన్ని లేవనెత్తినప్పుడు ప్రభుత్వం ఎందుకు ఇబ్బందిపడిందని ఖర్గే ప్రశ్నించారు."నిజం వినండి, సమాధానం ఇవ్వండి. లేదంటే ఖండించండి" అని వ్యాఖ్యానించారు. ప్రధాని ప్రసంగంలో విషయపరమైన సమాధానాలు లేకపోవడంతోనే ప్రతిపక్షం వాకౌట్ చేసినట్లు చెప్పారు. "మేం లేవనెత్తిన సమస్యలకు ఆయన దగ్గర సమాధానం లేదు. తర్వాత మాపై విమర్శలు చేయడమే ంచామన్న ఆరోపణలను కూడా ఖర్గే ఖండించారు. "సిక్కు సమాజాన్ని మేం గౌరవిస్తాం. డాక్టర్ మన్మోహన్ సింగ్ దేశానికి రెండుసార్లు ప్రధానిగా సేవలందించారు" అని గుర్తుచేశారు. గత 10 ఏళ్లుగా కాంగ్రెస్‌పై విమర్శలు చేయడమే తప్ప ప్రజల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి పెట్టలేదని ఖర్గే ఆరోపించారు.అదే సమయంలో కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్? కూడా ప్రధాని ప్రసంగంపై తీవ్ర విమర్శలు చేశారు. రాజ్యసభలో ప్రతిపక్షం లేవనెత్తిన కీలక అంశాలకు ప్రధాని సమాధానం ఇవ్వలేదని ఆరోపించారు.

# విదేశాల నుంచి 23 వేల మంది భారతీయుల బహిష్కరణ. 2025 గణాంకాలు విడుదల

**దుబాయ్ :**తమ దేశంలో ఉంటూ, నిబంధనలు పాటించని విదేశీయుల్ని ఆయా దేశాలు బహిష్కరించడం సహజమే. అలాగే విదేశాల్లో ఉంటున్న భారతీయుల్ని కూడా అక్కడి నిబంధనలు పాటించకుంటే బహిష్కరించి, తిరిగి పంపిస్తారు. ఇలా గతేడాది ఏకంగా వివిధ దేశాల నుంచి 22,900 మంది భారతీయుల్ని ప్రపంచ దేశాలు బహిష్కరించాయి. దీనికి సంబంధించి కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ తాజాగా పార్లమెంట్‌లో ఒక నివేదిక విడుదల చేసింది.2025లో విదేశాల నుంచి 22,900 మంది భారతీయులు బహిష్కరణకు గురైనట్లు కేంద్రం వెల్లడించింది. అయితే, ఎక్కువ మంది అనుకునేటట్లు ఇండియన్స్‌ను ఎక్కువగా తిరిగి పంపించిన దేశం అమెరికా కాదు. సౌదీ అరేబియా నుంచి ఎక్కువ మంది ఇండియన్స్ గతేడాది బహిష్కరణకు గురయ్యారు. ఇందులో జెద్దా నుంచి ఏకంగా 8,921 మంది, జెద్దా నుంచి 4,335 మంది ఒక్క ఏడాదిలోనే బహిష్కరణకు గురై తిరిగి ఇండియాకు వచ్చేశారు. ఆ తర్వాత యూఏఈ నుంచి ఎక్కువ మందిని బహిష్కరించారు. వీరిలో 7,896 మంది భారతీయులు దుబాయ్ నుంచి, 1,662 మంది అబుదాబి నుంచి డిపోర్ట్ అయ్యారు. ఎక్కువ మంది డ్రీమ్ కంట్రీ అమెరికా నుంచి గతేడాది 3,806 మంది భారతీయులు బహిష్కరణకు గురయ్యారు. ఆ తర్వాతి స్థానాల్లో మలేసియా నుంచి 1,675 మంది, మయన్మార్ నుంచి 1,065 మంది, సింగపూర్ నుంచి 300 మంది, మాల్దీవ్స్ నుంచి 150 మంది, యూకే నుంచి 70 మంది భారతీయులు బహిష్కరణకు గురయ్యారు.

printed published and owned by CHILVERA SHIVAKUMAR and printed JWAALA PRINTERS H.NO.- 10-15/1/A, KUMMARI GAINI,MANDAL PAPANNAPETA, DISTRICT, MEDAK, TELANGANA- 502303- Gmail.medaktoday94@gmail.com,Editor: CHILVERA SHIVAKUMAR. RNI NO.TELTEL. 2023 ,88524, 9948265095.9494117870..